పేదల కోసం ఆలోచించే నాయకుడు జగన్

కాళ్ల: రాష్ట్రంలో పేద ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం ఆలోచించే నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పల్లెపాలెం గ్రామంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. స్థలాలు ఇవ్వడంతో పాటు లబ్ధిదారులు రూపాయి ఖర్చు లేకుండా ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలను అందిస్తున్నామని వివరించారు. చంద్రబాబునాయుడు ఏనాడైనా ప్రజలకు సంక్షేమ పథకాల అందించారా? అని స్థానికలను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించి ఎన్నికలకు సిద్ధమవుతున్నారని మీరు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గా ప్రసాద్ రాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షులు బర్రె గంటయ్య, బొడ్డు రామకృష్ణ, గాది వెంకటేశ్వరరావు, తిరుమని నరసయ్య, తోటకూర చిన్న, మురళి రాజు పాల్గొన్నారు.



కాళ్ల: పల్లిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న పీవీఎల్

అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని కాపాడింది జగనన్నే

ఉండి: అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని కాపాడి వారికి సమాజంలోనూ, కుటుంబంలోను సముచిత గౌరవాన్నిచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం అర్తమూరులో 56 మంది జగనన్న అవుట్ లబ్ధిదారులకు ఇంటిపట్టా శాశ్వత హక్కు పత్రాలను పీవీఎల్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో పీవీఎల్ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల బాధలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలగించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనబోయిన వీర్రాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, కరిమెరక శివనాగరాజు, గలావిల్లి ధనుంజయ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోనబోయిన వెంకటేశ్వరరావు, గోనబోయిన రామదాసు, కందుల అప్పలరాజు, సిదరబోయిన రామేశ్వరరావు, కందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉండి: అర్తమూరులో జగనన్న ఇంటిస్థలం శాశ్వత హక్కు పత్రాలను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

రహదారుల అభివృద్ధికి సీఎం జగన్ చర్యలు



కాళ్ల: కలవపూడి రహదారి అభివృద్ధికి భూమి పూజ చేస్తున్న పీవీఎల్



ఉండి: గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: రహదారుల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. కాళ్ల మండలం శివారు కలవపూడి నుంచి మోడి వరకు, ఎస్సీ బోస్ కాలనీ నుంచి మాలవాని తిప్ప వరకు రహదారుల అభివృద్ధికి సుమారు రూ.20 లక్షలతో ఆర్అండ్‌బీ రాష్ట్ర రహదారి మరమ్మతులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రతిపక్షాలకు దీటైన సమాధానం చెబుతూ రహదారులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

ఉండి: ప్రజాసమస్యల పరిష్కారం, గ్రామాలను అభివృద్ధి చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక కాపులపేటలో రూ.40లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ (వాటర్ ట్యాంక్), రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రారంభిచడంతో పాటుగా నక్కరాజుగుంటలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ ఆధ్వర్యంలో గురువారం పీవీఎల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు తమ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అనంతరం యండగండి గ్రామంలో గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి పీవీఎల్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, కాలా రామావతారం, తవుడు,విజయ రామరాజు, పైడియ్య, బొడ్డు సూరమ్మ,వెలగపల్లి టోనీ, వేగేశ్న వేణు, వర్ధనపు ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌ను సందర్శించిన నార్వే శాస్త్రవేత్తల బృందం

భీమవరం: మంచినీటి వనరుల్లో ఉన్న వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు ఉపయోగించే పరికరాలను ఎక్కడ ప్రయోగించాలనే ప్రాంతాలను గుర్తించేందుకు నార్వేకి చెందిన శాస్త్రవేత్తల బృందం గురువారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సందర్శించింది. దేశంలోని పలు ఐఐటీలు, యూరోపియన్ యూనియన్ దేశాలు సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన స్ప్రింగ్‌ప్రాజెక్ట్‌లో భాగంగా నార్వేకి చెందిన ఆర్కిటిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫాసిల్ ఎజ్జుగ ఎరగనో కళాశాలలోని వెట్ సెంటర్ సందర్శించి మాట్లాడుతూ మూడు రోజులగా ఈ ప్రాంతంలోని నీటి వనరుల్లో వ్యర్థాలను ఏ విధంగా తొలగించాలి? ప్రాసెసింగ్ యూనిట్స్‌లోని వ్యర్థాలను ఏ విధంగా తొలగించాలి? అనే అంశాలపై ఆయా సంస్థల అధిపతులతో చర్చించనున్నట్లు చెప్పారు. అనంతరం ఫాసిల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోమిల్ ఠాకూర్, స్ప్రింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి ఏ రామకృష్ణంరాజు, డైరెక్టర్ ఎం .జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో నార్వేకి చెందిన ఫాసిల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆక్రమణల తొలగింపు

ఉండి: మండలంలోని వాండ్రం శివారు వాండ్రంలంకలో దళితుల స్మశానాన్ని ఆక్రమించి రోడ్డు వేసేందుకు ప్రయత్నించడం, రోడ్డు ఆక్రమణ వంటి తదితర విషయాలపై స్థానిక దళితులు ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ చేసిన ఫిర్యాదుపై పర్యటించి ఆక్రమణలు తొలగింపుకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులుల వెంటనే స్పందించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయానికి రోడ్డు పని కోసం దింపిన మెటీరియల్‌ను గ్రామ పంచాయితీ కార్యదర్శి జేవీటీ నాయుడు, ఆర్ఐ కార్తీక్, వీఆర్వో ఎస్ చిన్నారావు ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే శ్మశానానికి ఫెన్సింగ్ వేసే కార్యక్రమాన్ని వెంటనే చేపడతామని అధికారులు తెలిపారు. వాండ్రంలంక నుంచి శ్మశానం వైపు వచ్చే రోడ్డు ఆక్రమణకు గురైందంటూ దళితులు ఆరోపించడంతో దానిని సర్వే చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



వాండ్రంలంక శ్మశానంలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాల గ్రామోత్సవం

ఆకివీడు: పురాతన వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ఠా కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో ఉంచిన నూతన విగ్రహాల్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. ఈ నెల 15న శాంతి మంత్ర పఠనం, గణపతి పూజ, 16న గోపూజ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, 17న శ్రీ చక్ర నవావరణార్చన, జలాధివాసము, 18న క్షీరాదివాసం, 19న మండపారాధన, ధాన్యాధివాసము, అనువాకాభిమంత్రణ, 20న వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

సంక్షేమ పథకాలపై ప్రచారం



ఉత్తరపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



వెంపలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పత్రాలు అందిస్తున్న దృశ్యం

వీరవాసరం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుంది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను గురువారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ తెలియజేస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరుతున్నామని వివరించారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: గత 58 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరో ప్రక్క అభివృద్ధి పనులు చేస్తూ రెండు కళ్లలా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, సర్పంచ్ జిల్లా కొండయ్య అన్నారు. భీమవరం మండలంలోని వెంప, కొత్తపూసలమర్రు గ్రామాలలో గురువారం గడప గడపకు సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి గత 58 నెలల్లో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావు, నాయకులు కలిదిండి అప్పలరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, దాట్ల శ్రీనివాసరాజు, సానబోయిన బాపూజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

18 నుంచి ఒంటి పూట బడులు

పాలకోడేరు: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి 1 పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు .ఈనెల 18 నుంచి ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు.. ఏప్రిల్23 వరకు ఈ ఒంటి పూట బడులు కొనసాగుతాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాళ్ల: మండలంలోని కాళ్ల గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఉన్న 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీసలి, కోమటిగుంట, సూర్యారావుపేట, చినపుల్లేరు, పెదపుల్లేరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి

వీరవాసరం: దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుండె నగేష్ బాబు కోరారు. వీరవాసరం మండలం తోలేరు గ్రామంలో మాల మహానాడు భీమవరం నియోజకవర్గ కార్యదర్శి సరెళ్ళ పృథ్వీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అయినా దళితులకు అండగా ఉండి ,దళితులకు రావాల్సి రాయితీలను 100 శాతం ఇస్తామని, ఆ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన వారికే మాల మహానాడు మద్దతుగా ఉంటుందని తెలిపారు. సరెళ్ళ శ్రీనివాస్, వర్ధనకు మోషే పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్న దృశ్యం

భీమవరం: దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి గోరి కడతారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ హెచ్చరించారు. రైతులకు పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా గురువారం భీమవరంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికలముందు ప్రజా సమస్యలను, పోరాటాలను పక్కదారి పట్టించేందుకు పౌరసత్వ చట్ట సవరణను ముందుకు తెచ్చారని ఆరోపించారు. అఖిలభారత కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలక ధారాదత్తం చేయడం ద్వారా వ్యవసాయం కోల్పోతామని, రైతులు కూలీలుగా మారిపోతారని సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ఢిల్లీలో జరుగుతున్న రైతు, కార్మిక ఉద్యమానికి మద్దతుగా గురువారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో షేక్ వల్లీ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా



గొరగనమూడిలో ఊక ట్రాక్టర్ బోల్తా కొట్టిన దృశ్యం

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి జాతీయ రహదారిపై జ్ఞానానంద ఆశ్రమం వద్ద గురువారం ఊక ట్రాక్టర్ బోల్తా పడింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే పాలకొల్లు-భీమవరం వైపు వెళ్లే వాహనాలు మాత్రం పెద్ద ఎత్తున నిలిచిపోయాయి.

విద్యార్థుల కెరీర్ కోసమే ఎంఓయూ



విష్ణు కళాశాల రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ-బిజినెస్ సెంటర్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులకు అభ్యసన అనుభవాన్ని, కెరీర్ అవకాశాలను మెరుగుపర్చడానికి రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ-బిజినెస్ సెంటర్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు చెప్పారు. ఎంఓయూ కుదుర్చుకున్న విషయాన్ని గురువారం భీమవరంలో విలేకరులకు తెలిపారు. ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను పెంపొందించే దిశగా రెనాల్ట్ నిస్సాన్ ముఖ్యమైన అడుగు వేసిందనిగఈ భాగస్వామ్యం రెనాల్ట్ నిస్సాన్ సంస్థకు విద్యా సంస్థలకు మద్దతు ఇవ్వడానికి, ఔత్సాహిక ఇంజినీర్లకు జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి సాధనలో సాధికారత కల్పించడానికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

పాలకోడేరు: జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి, యాజమాన్య హక్కులు కల్పించడం రాష్ట్ర చరిత్రలోనే విప్లవాత్మకమైన చర్య అని శృంగవృక్షం సర్పంచ్ జంగం సూరిబాబు అన్నారు. గురువారం ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ మహిళలకే వర్తింపజేస్తూ, ఆడబడుచులకు వైఎస్సార్ సీపీ ఎంతో ప్రాధాన్యతనిస్తోందని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పిలుపు నిచ్చారు. ఉప సర్పంచ్ కలిదిండి ఆనందరాజు , వైస్ ఎంపీపీ సొడదాసి నరేష్, వార్డు సభ్యురాలు సోము దుర్గా భవానీ, మాజీ సర్పంచ్ కటిక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం దేవస్థానం ధర్మకర్తలు మండలి సహకారంతో లోక క్షేమం, ప్రజలు సుఖ శాంతుల కోసం అమ్మవారికి ప్రత్యేక లక్ష పుష్పార్చన,ప్ర త్యేక అభిషేకాల పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ నేతృత్వంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయచైర్మన్ మానేపల్లి నాగేశ్వరావు ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకట రామారావు , చెల్లంకి నాగ శేషగిరి, మావూరి సుందరరావు, తాళ్ళపూడి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు

ఎన్నికల శిక్షణను విజయవంతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): నియోజకవర్గ స్థాయిలో జరిగే ఎన్నికల శిక్షణ తరగతులకు సెక్టారు అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టార్ ట్రైనర్లు అత్యంత బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలని జిల్లా జాయింటు కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు .గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్లో ఉండి నియోజక వర్గం సెక్టారు అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టారు ట్రైనర్లుకు ఎన్నికల శిక్షణ తరగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15, 16 తేదీలలో జరిగే నియోజక వర్గ స్థాయిలో జరిగే ఎన్నికల శిక్షణా తరగతులు విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల నియమావళిపై శిక్షణ

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) పై సచివాలయం ఉద్యోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల అధికారి, ఎసీపీ పత్తి గౌర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనల పై సచివాలయం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రెండు గ్రామాల్లో పోలీసుల కవాతు



రాయకుదురులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎన్నికల బందోబస్తు పై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. రాయకుదురు, చింతలకోటి గరువులో 67 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది తో కలిసి గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరవాసరం పాలిటెక్నిక్ కళాశాలకు ప్రత్యేక సీఐఎస్ఎఫ్ బృందాలు రావడంతో సిబ్బందితో కలిసి మార్చ్ నిర్వహించామన్నారు. ఎన్నికలు ముగిసే వరకూ ఈ సిబ్బంది ఇక్కడే ఉంటారని, మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి బందోబస్తుగా ఉంటారని వివరించారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: కారల్ మార్క్స్ వర్ధంతిని భీమవరం మెంటేవారితోట సీపీఎం కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు, జుత్తిగ నర్సింహమూర్తి మార్క్స్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం, దోపిడి నుంచి విముక్తి కోసం కారల్ మార్క్స్ యావ జ్జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.వాసుదేవరావు, ఎం .వైకుంఠరావు, గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాల అందజేత

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పంచారామక్షేత్రానికి అగ్నిమాపక శాఖ నుంచి అగ్ని ప్రమాద నివారణ పరికరాలను గురువారం భీమవరం అగ్నిమాపక అధికారి సూర్యప్రకాష్ అందజేశారు. పంచారామక్షేత్రం కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజుకు వాటిని అందించి వాటిని ఎలా ఉపయోగించాలో తెలియజేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందజేత

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో ముగ్గురు దివ్యాంగులకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్‌ను జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణంపై మానవత దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీ రామరాజు, జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక్, ఆర్‌వీఎస్ రాజు, మండల కోచైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ట్రీమ్-125 వాహనం ఆవిష్కరణ



రెడ్డి అండ్ రెడ్డి షోరూమ్‌లో ఎక్స్‌ట్రీమ్-125 వాహనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి హీరో షోరూమ్‌లో గురువారం ఎక్స్‌ట్రీమ్-125 వాహనాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా షోరూమ్ ఎండీ జి వెంకటరెడ్డి మాట్లాడుతూ 125 సీసీలో స్పోర్ట్స్ వెర్షన్‌లో అత్యాధునిక ఫీచర్స్‌ను ఎక్స్‌ట్రీమ్ వాహనంలో పొందుపర్చినట్లు చెప్పారు. ఈ వాహనం యువతకు నచ్చే విధంగా ఏబీఎస్ టెక్నాలజీ, రైడర్ భద్రతకు అనుగుణంగా తయారుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ మేనేజర్ ఎన్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఉండి: మండలంలోని యండగండి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ముదునూరి కృష్ణచైతన్య ముత్యాలరాజుకు అమెరికాకు వెళ్లాడు.దీంతో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఇంటికి తాళం వేశారు. అయితే గురువారం ఉదయం 7 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల ఇంట్లోకి చొరబడి ఇంట్లోని రూ.5 వేల విలువైన వెండి వస్తువులు, రూ.8 వేల నగదు, 4 గ్రాముల బంగారు వస్తువులు దోచుకుని వెళ్లినట్లు కుటుంబ సభ్యుడు రామరాజు(రాంబాబు) గురువారం పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.